క్లుప్తంగా

మెగా లోక్ అదాలత్‌లో 1824 కేసులు పరిష్కారం



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి గోవర్ధన్

గాజువాక : గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు 1824 కేసులను పరిష్కరించారు. అదాలత్‌ను ప్రారంభించిన 13వ అదనపు అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ మాట్లాడుతూ కక్షిదారులు తమ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ విధంగా కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఇరుపక్షాల మధ్య బంధాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. అనంతరం వివిధ బెంచ్‌లలో పరిష్కరించిన కేసులకు రూ.3.38 కోట్లను పరిహారంగా చెల్లించినట్లు కోర్టు వర్గా లు తెలిపాయి. న్యాయమూర్తులు ఎస్.విద్య, ఇ.రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి, వై.ప్రేమలత, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.పట్టాభి రామారావు, ఎం.ఈశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కూర్మన్నపాలెం: యువతి అదృశ్యంపై దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. యాదవజగ్గరాజుపేట ప్రాంతానికి కోన శిరీష(25) ఈ నెల 7వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలింపు చర్యలు చేపట్టారు. తెలిసిన బంధువులను అడిగినా ఫలితం లేకపోవడంతో, దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫార్మాసిటీలో పని చేస్తున్న శిరీషకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు అనుకున్నారు. ఆ పెళ్లి ఇష్టం లేక, ఇంటి నుంచి వెళ్లిపోయిందని భావిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. యువతి ఆచూకీ తెలిసిన వారు 95052 75722 నంబర్‌కు ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి



దీన్ దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గాజువాక : ఏకాత్మతా మానవతావాదం సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ నాయకులు నివాళులర్పించారు. దీన్‌దయాళ్ వర్ధంతి సందర్భంగా గాజువాకలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఏకాత్మతా సిద్ధాంత రూపకల్పనలో ఆయన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, సిరసపల్లి నూకరాజు, బొండా ఎల్లాజీరావు, శశిధరణ్ పిళ్లై, కట్టా పద్మ, బాటా శ్రీనివాస్, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు రామాలయం పక్కన వేంచేసియున్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి, కంచి కామాక్షి, కాశీ విశ్వేశ్వరస్వామి, లక్ష్మీ గణపతి, నందీశ్వర్ల ఆలయ 16వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, దొమ్మేటి అప్పారావు, మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నపైనే ప్రజల నమ్మకం

- సమన్వయంతో ముందుకు సాగుదాం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- గాజువాక క్లస్టర్–3 సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



శిక్షణకు హాజరైన సచివాలయ కన్వీనర్లు,గృహ సారథులు

అగనంపూడి: సంక్షేమ పథకాలను అర్హులందరికీ పారదర్శకంగా అందిస్తూ, పేదల బాగోగులు చూస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపైనే ప్రజలందరూ నమ్మకం పెట్టుకున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో గాజువాక క్లస్టర్–3కి చెందిన 79, 85వ వార్డుల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పెదమడకలోని జీవీఎంసీ కల్యాణమండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్‌కు రథసారథులు గృహ సారథులేనన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లపై ఉందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ ఇంటి ముంగిటకే అందుతున్నా, ఇంకా పకడ్బందీగా అమలు జరపాలనే ఉద్దేశంతోనే గృహ సారథుల వ్యవస్థను ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారన్నారు. వలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని గృహ సారథులు ముందుకు సాగాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అందజేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకుంటేనే, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరుగుతాయన్నారు. ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందించడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. అనంతరం శిక్షణకు సంబంధించిన వీడియో క్లిప్పింగులను ప్రదర్శించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. మా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, 79వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, గాజువాక క్లస్టర్ ఇన్‌చార్జి రామచంద్రరాజు, నాయకులు ఇల్లపు ప్రసాద్, పూర్ణానందశర్మ, నక్కా రమణబాబు, గుర్రం శ్రీను, ఎదురు సోమనాయుడు, సమర, మామిడి శ్రీను, పెదిరెడ్ల హరీష్, యలమంచిలి అప్పారావు, కలిపాక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు దరఖాస్తు గడువు 10

- విజయవాడలో పాయింట్ ఇవ్వడం అభినందనీయం
- 66వ వార్డు కార్పొరేటర్, హజ్ కమిటీ సభ్యుడు ఇమ్రాన్



సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ ఇమ్రాన్

గాజువాక : ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ యాత్రకు వెళ్లనున్న ముస్లింలకు విజయవాడలో బయల్దేరే (ఎంబార్కేషన్) పాయింట్‌ను ఇవ్వడంపై స్థానిక ముస్లిం మత పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గాజువాకలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 66వ వార్డు కార్పొరేటర్, హజ్ కమిటీ సభ్యుడు మహ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ విజయవాడలో ఎంబార్కేషన్ కల్పించడంపై ముఖ్యమంత్రికి, హజ్ కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ విషయంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా విశేష కృషి చేశారన్నారు. దీనిపై హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్ యాత్ర షెడ్యూల్‌ను కూడా విడుదల చేసిందని, ఈ యాత్రకు వెళ్లాలనుకునేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వచ్చేనెల 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని, ఆసక్తిగలవారు www. hajcommittee. gov. in, www. apstatehajcommittee. com ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థుల పాస్‌పోర్టు ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు చెల్లుబాటులో ఉండాలని, కోవిడ్ వ్యాక్సినేషన్ చేయించుకుని ఉండాలని స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 18004257873, 08662471786లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, వివిధ మసీదు కమిటీల ప్రతినిధులు ఎస్.ఎం.డీ. గౌస్, అలియా నురాని, దుబాయ్ బాషా, ముఫ్తీ జాఫర్, అతుల్ రెహ్మాన్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

గాజువాక : గాజువాక నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లను నియమించారు. ఈ మేరకు ఆ వివరాలను పార్టీ కేంద్ర కమిటీ శనివారం విడుదల చేసింది.

వార్డు	కన్వీనర్
64	గంటపల్లి అమ్మోరు
65	అడిగర్ల రమణ
66	తుమ్మల హరి
67	బండారు హరి సాయి నాగు
68	వాకపల్లి శేఖర్‌బాబు
69	పప్పల ప్రసాద్
70	దినేష్ కాకర
71	ఎ.డేవిడ్ సునీల్
72	కొయ్యాన కృష్ణ
73	కందికొప్ప కిరణ్
74	యర్రాపాత్రుని తిరుపతి
75	ధర్మాల దిలీప్‌రెడ్డి
76	గొంప రమేష్
78	కిరణ్ కుమార్
79	మనిది జయలక్ష్మి
85	పప్పల ప్రసాద్
86	మన్నాపురం శ్రీనివాసరావు
87	దేవ దయానంద్
88	షేక్ సలీం

కార్మికుల పోరాట స్ఫూర్తి అ‘ద్వితీయం’

- కొనియాడిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- ఉక్కు ఉద్యమం ప్రారంభించి రెండేళ్లు
- నేడు డాక్యుమెంటరీ ఆవిష్కరణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మికుల పోరాటం అద్వితీయమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఐక్య ఉద్యమాలతో ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 2021 ఫిబ్రవరి 12న ప్రారంభమైన ఉద్యమం, రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటలకు కూర్మన్నపాలెంలోని దీక్ష శిబిరం వద్ద విశాఖ ఉక్కు పేరుతో డాక్యుమెంటరీని వైజాగ్ స్టీల్ ఫ్యామిలీ యూట్యూబ్ చానల్‌లో కె.కె. రావు చేతుల మీదుగా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కూర్మన్నపాలెం కూడలిలో రిలే నిరాహార దీక్షల్లో 730వ రోజు శనివారం సంస్థకు చెందిన ఎల్ ఎంఎంఎం మరియు ఎస్‌బీఎం విభాగ కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, డి.సురేష్, డి.శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర ప్రసంగించారు. విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అన్నారు. దానిని కాపాడుకునేందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారన్నారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో తగ్గేదే లేదని, కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

గౌరీదేవికి సారె సమర్పణ



సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

- వైభవంగా అనుపు ఉత్సవం

గోపాలపట్నం: గౌరీ దేవికి మహిళలు పెద్ద ఎత్తున సారె సమర్పించారు. కొత్తపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా శనివారం అనుపు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. కొత్తపాలెం పరిసర ప్రాంతాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి వివిధ వంటకాలతో సారె సమర్పించారు. ఎమ్మెల్యే గణబాబు, స్థానిక కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, గౌరి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరసతో కిటకిటలాడిన రహదారులు

అనుపు మహోత్సవాల్లో భాగంగా సాయంత్రం పరస జరిగింది. దీంతో రహదారులు కిటకిటలాడాయి. స్థానికులు కుటుంబ సభ్యులతో హాజరు కావడంతో అంతటా సందడి నెలకొంది. పరసలో గృహోపకరణాలు, వివిధ రకాల వస్తువులు, రంగుల రాట్నాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వరాహాల స్వైర విహారం



కొండయ్యవలసలో ఇళ్ల మధ్య సంచరిస్తున్న పందుల గుంపు



ఇంటి వరండాలో సంచరిస్తూ..



రోడ్డుపై వాహనాల పార్కింగ్ వద్ద..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసలో ఆవాసాల మధ్య వరహాలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్ల ఆవరణల్లోకి పందుల గుంపులు ప్రవేశించి, అస్తవ్యస్తం చేస్తుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నాళ్లుగా పదుల సంఖ్యలో పందులు కొండయ్యవలస, అట్టవానిపాలెం, పెదమడకల్లో డ్రైనేజీలను ఆవాసాలుగా మార్చుకొని పిల్లలు, మహిళలకు భయాందోళనకు గురిచేస్తున్నాయి. పందులను నిర్మూలించాలని వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి, నిర్మూలించాలని కోరుతున్నారు.

సంజీవిగిరి కాలనీలో పట్టపగలే చోరీ



వివరాలు సేకరిస్తున్న న్యూపోర్టు పోలీసులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు సంజీవిగిరి కాలనీలో శనివారం మధ్యాహ్నం చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆడారి పరదేశినాయుడు, కనకమహాలక్ష్మి దంపతులు సంజీవిగిరి కాలనీలో నివాసం ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల మధ్యలో కనకమహాలక్ష్మి దుస్తులు ఆరబెట్టేందుకు మేడపైకి వెళ్లింది. ఆ సమయంలో ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు లోపలికి ప్రవేశించి, ఇంట్లో ఉంచిన రూ.5వేల నగదు, సుమారు ఐదు తులాల బంగారు నల్లపూసలు, చైన్, ఉంగరం, చెవి దుద్దులు చోరీ చేశారు. మేడపై నుంచి కిందకు వచ్చిన ఆమె బీరువా తలుపులు తెరిచి ఉండడం, అందులోని నగదు, నగలు కనిపించకపోవడంతో లబోదిబోమంటూ భర్తకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. వెంటనే న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన క్రైం ఎస్ఐ జి.వి. ప్రసాద్ సిబ్బందితో కలసి సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో ఏయూ సెక్యూరిటీ గార్డుల అరెస్టు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): మూడో పట్టణ పరిధిలో గంజాయి కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి బీచ్‌రోడ్డులో అక్రమంగా గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఏయూలో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న చంద్రమౌళి, అప్పలరాజు, సురేష్ వద్ద అక్రమంగా 500 గ్రాములు గంజాయిని గుర్తించారు. ఈ ముగ్గుర్ని అరెస్ట్ చేసి శనివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

తెలుగుభాష సదస్సు వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు శాఖ, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 21, 22తేదీల్లో అంతర్జాతీయ తెలుగు భాషా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన వెబ్‌సైట్ www. telugu. in ను ఏయూ ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సమావేశాల రూపకర్త డాక్టర్ మూర్తి రేమళ్ళ ఇస్రో శాస్త్రవేత్త మార్గదర్శనంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థులతో తయారు చేసిన ఈ వెబ్‌సైట్‌లో సమావేశాలకు సంబంధించిన అన్ని వివరాలను ఒకే చోట నిక్షిప్తం చేస్తున్నారు. ఇంకా ప్రత్యక్షంగా పాల్గొనలేని వారికి ప్రత్యక్ష ప్రసారం లింక్ కూడా దీనిలో ఉంచడం జరుగుతోంది. రెండు రోజులు జరిగే సమావేశాలలో 12 సదస్సులు 70 మంది వక్తలు, ఆచార్యులు పరిశోధకులు వివిధ దేశాల మాతృభాషా ప్రేమికులు, సాహితీవేత్తలు పాల్గొంటారు. టీఎల్ఎన్ సభామందిరం వేదికగా ఈ సమావేశాలు జరుగుతాయి. శ్రీ మల్లిక్ పుచ్చా (అమెరికా) ఆధ్వర్యంలో ప్రత్యేక సమాంతర సభా మందిరంలో భాగవత ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహిస్తారు. సమైక్య భారతి జాతీయ గౌరవాధ్యక్షుడు రేమళ్ళ మూర్తి, సమైక్య భారతి సమన్వయకర్త కన్నయ్య, ఆంధ్ర విశ్వ కళా పరిషత్ తెలుగు శాఖ ఆచార్యులు అయ్యగారి సీతారత్నం పాల్గొన్నారు.

డాక్‌యార్డ్‌లో ఉద్యోగి మృతి

మల్కాపురం: డాక్‌యార్డులో విధులకు వెళ్లిన ఓ ఉద్యోగి విద్యుత్ షాక్ కారణంగా మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 58వ వార్డు రామ్‌నగర్ ప్రాంతంలో ఒడరేవుల కుమార్‌స్వామి (35) భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. నేవల్ డాక్‌యార్డ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్‌కు డ్యూటీకి వెళ్లాడు. అనంతరం 8.15 గంటల సమయంలో డాక్‌యార్డ్‌లోని డాక్ వద్ద గల ఓ నౌక దిగువవ కుమార్ స్వామి నీటిలో మునిగి ఉన్నట్టు ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సహచర ఉద్యోగులు గుర్తించారు. ఉన్నతాధికారులకు సమాచారమివ్వడంతో కుమార్ స్వామిని ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టుగా వైద్యులు నిర్ధారించారు. వెంటనే అధికారులు మల్కాపురం పోలీసులకు, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి వెళ్లి ఘటనపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

కంచె దాటి..మృత్యు ఒడిలోకి..

- జూ పార్కు నుంచి పీఎంపాలెం వరకు ఇనుప కంచె శిథిలం
- దీంతో జనారణ్యంలోకి వన్యప్రాణులు
- వాహనాలకు అడ్డంపడి మృత్యువాత



జూ సమీపంలో కంబాలకొండ నుంచి రోడ్డుమీదకు వచ్చిన జింక (ఫైల్)

ఆరిలోవ : అడవుల్లో పచ్చని చెట్ల మధ్య చెంగుచెంగున తిరిగే వన్యప్రాణులు జనారణ్యంలోకి చేరి మృత్యువాత పడుతున్నాయి. ఆకలి, దాహం తీర్చుకోవడానికి బయటకు వస్తున్నాయో, వేరే క్రూర మృగాలు వెంటబడితే వాటి నుంచి రక్షించుకోవడానికి ప్రాణ భయంతో బయటకు వస్తున్నాయో తెలియదు కానీ ప్రాణాలు మాత్రం పోతున్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న కంబాలకొండ, సీత కొండలు నుంచి వచ్చిన కణుజులు, చుక్కల జింకలు, అడవి పందులు, కొండ మేకలు ఏదో ఓచోట తరుచూ ప్రాణాలు కోల్పోతున్నాయి.

జాతీయరహదారిని ఆనుకొని కంబాలకొండ ఇటు జూ పార్కు నుంచి పీఎంపాలెం వరకు, అటు అడవివరం నుంచి శొంఠ్యాం వరకు కొన్ని వేల హెక్టార్లలో అటవీ ప్రాంతముంది. మరో వైపు జాతీయరహదారిని ఆనుకొని డెయిరీ ఫారం, విశాలాక్షినగర్ నుంచి జోడుగుళ్లపాలెం, జూ పార్కు వరకు బీచ్‌రోడ్డును ఆనుకొని సీతకొండ ఉంది. ఆ రెండు కొండలు రిజర్వుడ్ ఫారెస్టుకు చెందినవే. ఇవి దట్టమైన అటవీ ప్రాంతాలు. వాటిలో ఎక్కువ సంఖ్యలో జింకలు, కణుజులు, అడవి పందులు, గొండ మేకలు, తదితర వన్యప్రాణులు సంచరిస్తున్నాయి. చిరుతలు కూడా పదుల సంఖ్యలో తిరుగుతున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. అభయారణ్యమైన కొంబాలకొండలు నుంచి వన్యప్రాణులు బయటకు రాకుండా జాతీయ రహదారిని ఆనుకొని జూ పార్కు నుంచి పీఎం పాలెం వరకు ఇనుప తీగలతో కంచె వేశారు. దాని కింద ట్రెంచ్ తవ్వించారు. ఇప్పుడు ఆ కంచె చాలాచోట్ల శిథిలమైంది. సీతకొండకు మాత్రం ఎక్కడా కంచె ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో కంబాలకొండలో కంచె శిథిలమైన ప్రాంతాల నుంచి జింకలు, కణుజులు జాతీయరహదారిపైకి చేరి భారీ వాహనాలకు అడ్డంపడి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నాయి. జాతీయ రహదారిపై గడిచిన ఐదేళ్లలో సుమారు పది వరకు జింకలు, అడవి పందులు ప్రమాదాలకు గురయ్యాయి.

- మూడు రోజుల క్రితం సీతకొండ నుంచి ఓ కణుజు కిందకు దిగి విశాఖవ్యాలీ స్కూల్ సమీపంలో మృతి చెందింది. ఆ కణుజు మృతదేహం కుళ్లిపోవడంతో అటవీశాఖ అధికారులు దహనం చేయించారు. వృద్ధాప్యంతో కొండ పైనుంచి కిందకు జారిపడి మృతి చెంది ఉంటుందని అటవీ అధికారులు భావించారు.
- నెల క్రితం ఓ చుక్కల జింక సీతకొండ నుంచి కిందకు వచ్చి అదే ప్రాంతంలో సముద్రంలో దిగి కెరటాలకు బలైంది. ఇది దాహంతో నీరు తాగడానికి వెళ్లి కెరటాల్లో చిక్కుకుపోయి ఉంటుందని అటవీ అధికారులు భావించారు.
- రెండు నెలల క్రితం కంబాలకొండ నుంచి జనారణ్యంలోకి వచ్చిన ఓ కొండ మేకను డెయిరీ ఫారం సమీపంలో కుక్కలు తరిమి చంపేశాయి.

వేసవిలో బయటకు వస్తున్న వన్యప్రాణులు

వేసవి కాలంలో ఎక్కువ సంఖ్యలో కంబాలకొండలు, సీత కొండ నుంచి వన్యప్రాణులు జనారణ్యంలోకి చేరుతున్నాయి. నీటి కోసం ఎక్కువగా ఇవి బయటకు వస్తుంటాయని అటవీ అధికారులే భావిస్తున్నారు. కొండల అంచున నీటి కుండీలు ఏర్పాటు చేసి వాటికి రోజూ నీటిని సరఫరా చేస్తే వాటి మరణాలకు అడ్డుకట్టపడుతుందని వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు. దీంతో పాటు కొండలు నుంచి కిందకు దిగి రోడ్డుపైకి రాకుండా వెంటనే కంచె నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.